# స్థానిక ఎన్నికలపై హైకోర్టులో విచారణ

## ఎన్నికల నిర్వహణకు 60రోజుల సమయం కావాలన్న ఈసీ

**హైదరాబాద్, జూన్ 23:** ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ హైకోర్టును కోరింది. స్థానిక సంస్థల ఎన్నికల పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు సోమవారం విచారణ చేసింది. ఆరు నెలల తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల కేసు విచారణకు వచ్చింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున న్యాయవాదులు తమ వాదనలను కోర్టుకు వివరించారు. ఎన్ని రోజుల్లో ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహిస్తుందో చెప్పాలని హైకోర్టు పిటీషనర్లను ప్రశ్నించింది. గత ఫిబ్రవరిలోనే ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని.. ఎందుకు ఎన్నికలు నిర్వహించలేదని న్యాయస్థానం నిలదీసింది. తెలంగాణ రాష్ట్రంలో కులగణన సర్వే పూర్తి అవ్వలేదని కొంత సమయం కావాలని కోర్టుని ప్రభుత్వం కోరింది. ఎన్నికలు నిర్వహించడానికి మరో 60 రోజులు సమయం కావాలని ఎలక్షన్ కమిషన్ అడిగింది. ఎన్నికలైనా పెట్టాలని లేదా పాత సర్పంచ్‌లనే కొనసాగించాలని పిటీషనర్లు వాదనలు వినిపించారు. ఆరు నెలల్లో ఎన్నికలు పూర్తి చేయాలని నిబంధన ఉందని.. కానీ ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహించలేదని పిటీషనర్లు వాదనలు వినిపించారు. కాగా 2024 ఫిబ్రవరి 1వ తేదీన తెలంగాణ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసింది. స్థానిక సంస్థల ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది. పిటిషనర్లు, ప్రభుత్వం, రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ వాదనలు విన్న తర్వాత న్యాయస్థానం ఈ తీర్పు ఇచ్చింది. ఎన్నికలు నిర్వహణకు సమయం కావాలని ప్రభుత్వం కోరడంతో హైకోర్టు తీర్పు రిజర్వ్ చేసింది.

# పశ్చిమాసియా ఉద్రిక్తలపై ఐరాస అత్యవర భేటీ

## అమెరికా దౌత్యా నీతిని దెబ్బతీసిందని ఇరాన్ వెల్లడి

## యుద్ధం లక్ష్యాలు నెరవేరాయన్న నెతన్యాహు

**టెల్ అవీవ్, జూన్ 23:** ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం, అమెరికా రణరంగంలోకి దిగడంతో పశ్చిమాసియా రగులుతోంది. మరోవైపు పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించింది. అందులో ఐరాసలో ఇరాన్ రాయబారి అమీర్ సయీద్ ఇరవానీ మాట్లాడుతూ.. 'అమెరికా విదేశాంగ విధానాన్ని హైజాక్ చేసి.. నెతన్యాహు అగ్రరాజ్యాన్ని ఈ యుద్ధంలోకి లాగారు. అమెరికా చరిత్రలో ఇది మాయని మచ్చగా మిగిలిపోనుంది. దౌత్యాన్ని నాశనం చేయడానికి అగ్రరాజ్యం కంకణం కట్టుకుంది. దీనికి సరైన సమయంలో దీటుగా బదులిస్తాం' అని హెచ్చరించారు. ఈ ఉద్రిక్తతల వేళ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కీలక ప్రకటన చేశారు. టెహ్రాన్‌తో సుదీర్ఘ యుద్ధం ఉండబోదని అన్నారు. 'ఆపరేషన్ రైజింగ్ లయన్' పేరుతో తాము చేపట్టిన దాడుల్లో లక్ష్యానికి చేరువైనట్లు వెల్లడించారు.ప్రస్తుత ఇరాన్ పాలకులు మమ్మల్ని తుడిచిపెట్టాలని చూశారు. అందుకే ఈ ఆపరేషన్ చేపట్టాల్సి వచ్చింది. ఇందులో ప్రధానంగా మా అస్థిత్వానికి పొంచి ఉన్న రెండు ముప్పుల ను తొలగించాలనుకున్నాం. ఒకటి అణ్వాయుధాలు.. రెండు బాలిస్టిక్ క్షిపణులు. ఈ లక్ష్యాలను సాధించే దిశగా మేం ఒక్కో అడుగు వేస్తూ ముందుకుసాగుతున్నాం. వాటికి మేం చేరువయ్యాం. టెహ్రాన్‌తో సుదీర్ఘకాలం యుద్ధం కొనసాగించబోం' అని ఇజ్రాయెల్ ప్రధాని వెల్లడించారు. అయితే, అనుకున్న ఫలితం రాకముందే పోరాటం నుంచి నిష్క్రమించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ ÷-పై అమెరికా బాంబు దాడులు చేసిన అనంతరం నెతన్యాహు మీడియాతో మాట్లాడారు. 'టెహ్ర-ాన్‌లోని ఫోర్డో అణుకేంద్రాన్ని అమెరికా తీవ్రంగా ధ్వంసం చేసింది. అణ్వాయుధ కార్యక్రమంలో ఇరాన్‌ను వెనక్కి నెట్టాం. ముప్పును తొలగించుకున్నాం. లక్ష్యాలను సాధించడానికి అవసరానికి మించి మా చర్యలను కొనసాగించబోం. మా ర్గెట్‌ను చేరుకుంటే ఆపరేషన్ పూర్తయినట్లే. అప్పుడు యుద్ధం కూడా ఆగుతుంది. ఇజ్రాయెల్‌కు మద్దతుగా ఇరాన్ అణుశుద్ధి కేంద్రాలే లక్ష్యంగా అమెరికా క్షిపణులు, బాంబర్లతో విరుచుకుపడిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్రంగా స్పందించారు. 'యూదు శత్రువులు ఘోర తప్పిదం చేశారు. తీవ్ర నేరానికి పాల్పడ్డారు. దీనికి శిక్ష తప్పదు. తక్షణమే శిక్షించాల్సిన అవసరం ఉంది' అని పోస్ట్ చేశారు. అయితే, ఇందులో అమెరికా ప్రస్తావనను ఆయన తీసుకురాకపోవడం గమనార్హం. అమెరికా దాడులను ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తీవ్రంగా ఖండించారు. దీనికి అగ్రరాజ్యం మూల్యం చెల్లించుకోవా ల్సిందేనని హెచ్చరించారు. దాడుల అనంతరం ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. అమెరికాకు దీటుగా బదులిస్తామని పెజెష్కియాన్ తెలిపారు.

## పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

**శెనార్తి మీడియా, శంకరపట్నం :**

శంకరపట్నం మండల పరిధిలోని మొలంగూర్ గ్రామానికి చెందిన తడిగొప్పుల సంపత్( 45)మద్యానికి బానిసై, ఆర్థిక సమస్యలతో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేయగా వెంటనే వరంగల్ ఎం జి ఎం హాస్పిటల్, తరలించగా చికిత్స పొందుతూ, సోమవారం మధ్యాహ్నం మరణించినట్లు, మృతుడి భార్య కేశవపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపారు.

## డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి

**శెనార్తి మీడియా, గోదావరిఖని:** దేశ ఐక్యత కోసం తన ప్రాణాలు అర్పించిన డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దినోత్సవాన్ని రామగుండం బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్ర పటానికి పుష్పాంజలులు సమర్పించి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ కాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370 ను తొలగించేందుకు దిశా నిర్దేశం చేసిన మొట్టమొదటి నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచారని పేర్కొన్నారు. యువత ఈ త్యాగాలను స్మరించుకుంటూ జాతియ చైతన్యం పరిరక్షించాలన్నారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సిల్వ లక్ష్మీనారాయణ, శివాజీ, మహిళా మోర్చా నాయకురాలు సోమారపు లావణ్య, మహావదిరామన్న, పెద్దపల్లి రవీందర్, నవీన్, మేడి రాజు, శ్రవణ్, రాజు స్వామి తదితరులు పాల్గొన్నారు



# నిరుద్యోగ యువతకు వరం... ఏటీసీ

**శెనార్తి మీడియా, మానకొండూర్ :**

పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వివిధ పరిశ్రమల్లో ఉపాధి కల్పించడానికి అవసరమైన పారిశ్రామిక శిక్షణ ఇస్తున్న ఐటీఐలు అధునాతన సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా (ఏటీసీ)గా రూపొందుతున్నాయి. వీటికి టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ సంస్థ నిధులను సమకూర్చుతోంది. అత్యధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన శిక్షణ అందిస్తున్న ఈ కేంద్రాల్లో శిక్షణ పూర్తయిన వెంటనే విద్యార్థులకు ఉద్యోగాలు, సొంతంగా ఉపాధి అవకాశాలు లభించేలా ఏటీసీల్లో సిలబస్ రూపొందించారు. యువతకు అధునాతన, సాంకేతిక విద్యను అందించి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తుంది. ఇందులో భాగంగా ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన పారిశ్రామిక సంస్థ (ఐటీఐ)లను నవీకరించి అడ్వాన్స్ టెక్నాలజీ కేంద్రాలు(ఏటీసీ)గా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లితో పాటు ఎన్టీపీసీలో ముందుగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేసింది.తాజాగా ఉమ్మడి జిల్లాకు మరికొన్ని సెంటర్లను మంజూరు చేసింది. ఇందులో మానకొండూర్ కూడా ఉన్నది. త్వరలో ఈ కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు అధునాతన, సాంకేతికతపై శిక్షణకు ఆయా ఏటీసీ కేంద్రాల్లో శిక్షణ అందించనున్నారు. డిమాండ్ ఉన్న కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించడం, శిక్షణ పూర్తయిన వారికి స్వయం ఉపాధి కల్పించేలా పనిచేస్తాయి. పరిశ్రమల డిమాండ్‌కు అనుగుణంగా కొత్త కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. ఏడాది, రెండేళ్ల కోర్సులకు సంబంధించి సీట్లు భర్తీ చేయనున్నారు.

**కొత్త కోర్సులు ఇవే..**

**కోర్సులు సీట్లు కాలవ్యవధి**

**మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ అండ్ అటోమేషిన్- (ఏడాది)**

**ఇండ్రస్టియల్ అండ్ అటోమేషిన్ (ఏడాది)**

**ఇండస్ట్రియల్ రోబోటెక్స్, డిజిట్ మ్యానుఫ్యాక్టరింగ్- ఏడాది**

**ఆర్టిసియన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్ - (రెండేళ్లు)**

**బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫయిర్- (రెండేళ్లు)**

**మెకానిక్ ఎలక్ట్రానిక్ వెహికల్- (రెండేళ్లు)**




### స్వయం ఉపాధి దిశగా..



యువతకు స్వయం ఉపాధి పెంపొందించే దిశగా ఏటీసీలు దోహదపడుతా యి. ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చొరవచూపుతున్నారు. ఇందులో భాగంగా మానకొండూర్ నియోజవకవర్గానికి ఏటీసీ మంజూరైంది. ఏటీసీ కోర్సుల శిక్షణ అనంతరం నిరు ద్యోగ యవతకు ఉద్యోగ అవకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభించనున్నాయి.

**ఒగ్గు దామోదర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు**

### అభివృద్ధితో పాటు ఉపాధి అకాశాలు.



మానకొండూర్ ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ విజయం సాధించాక నియోజకవర్గ అభివృద్ధితో పాటు ఇక్కడి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏటీసీ సెంటర్ ను మానకొండూర్ నియోజకవర్గానికి మంజూరు చేయించారు. ఏటీసీ సెంటర్ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంత యువకులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

**ఉపేందర్ రెడ్డి, కాంగ్రెస్ గన్నేరువరం మండల అధ్యక్షుడు**

### స్కిల్ హబ్ గా మానకొండూర్



రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉపాధి కల్పించేందుకు పెద్దపీట వేస్తున్నది. ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చొరవతో మానకొండూర్ నియోజకవర్గానికి ఏటీసీ సెంటర్ మంజూరైంది. దీని ద్వారా ఇక్కడి యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ తో పాటు పుష్కలంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ సెంటర్ రాకతో మానకొండూర్ నియోజకవర్గం స్కిల్ హబ్ గా మారబోతుంది. ఈ సెంటర్ వచ్చేందుకు చొరవ చూపిన ఎమ్మెల్యేకు ధన్యవాదాలు.

**పోతిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ లీడర్**

# నషా ముక్త్ భారత్‌ను నిర్మిద్దాం

## కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సీటీసీలో మొక్కలు నాటిన కరీంనగర్ సీపీ

**శెనార్తి మీడియా, కరీంనగర్:**

అంతర్జాతీయ మత్తుపదార్థాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అవగాహన వారోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం సీటీసీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొని మొక్కను నాటారు. జూన్ 20 నుంచి 26 వరకు చేపట్టిన అవగాహన వారంలో భాగంగా మాదకద్రవ్య దుర్వినియోగంపై యువతలో చైతన్యం పెంచేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటున్నట్టు గౌష్ ఆలం తెలిపారు. మాదకద్రవ్య రహిత తెలంగాణ లక్ష్యంగా ప్రజా భాగస్వామ్యంతో కార్యాచరణ కొనసాగుతోందన్నారు. కమీషనరేట్ పరిధిలో అన్ని పోలీస్ స్టేషన్లలో అవగాహన ర్యాలీలు, పోస్టర్ ప్రదర్శనలు, విద్యాసంస్థల్లో సమావేశాలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ''నషా ముక్త్ భారత్ అభియాన్ (NMBA)'' కింద రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యాచరణకు అనుగుణంగా కరీంనగర్‌లో చురుకుగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీటీసీ వైస్ ప్రిన్సిపల్ ఏసీపీ వేణుగోపాల్, సీసీఆర్బి ఏసీపీ విజయ్ కుమార్, ఇన్స్పెక్టర్లు సతేష్ కుమార్, సరిలాల్, శ్రీనివాస్, తిరుపతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# ఇరాన్‌పై విరుచుకు పడుతున్న ఇజ్రాయిల్

## 15 యుద్ధవిమాలతో పలు ప్రాంతాల్లో దాడులు

**టెలీఅవివ్,జూన్23(ఆర్ఎన్ఎ):** ఇరాన్ వైమానిక స్థావరాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దేశంలో పశ్చిమ, తూర్పు, మధ్య ప్రాంతాల్లో గల ఆరు వైమానిక స్థావరాలపై భీకర దాడులు చేసింది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ మిలిటరీ తాజాగా వెల్లడించింది. దాడుల తాలూకు వీడియోలు కూడా షేర్ చేసింది. 15 యుద్ధ విమానాలతో ఈ దాడులు చేశామని తెలిపింది. రన్‌వేలు, భూగర్భంలోని బంకర్‌లు, ఓ రీఫ్యుయెలింగ్ ప్లేన్, ఎఫ్-14, ఎఫ్-5, ఏహెచ్-1 విహంగాలు, హెలికాప్టర్‌లు ధ్వంసమయ్యాయని పేర్కొంది. ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించాలనుకున్న యుద్ధ విమానాలను ధ్వంసం చేసినట్టు తెలిపింది. మిసైళ్లను నిల్వ చేసిన స్థావరాలను కూడా నాశనం చేసినట్టు పేర్కొంది. కచ్చితమైన నిఘా సమాచారంతో ఈ దాడులు చేసినట్టు వెల్లడించింది. ఇరాన్ మిలటరీ సామర్థ్యాలను దెబ్బతీసేందుకు నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటామని, గగనతల యుద్ధంలో సంపూర్ణ ఆధిపత్యమే తమ లక్ష్యమని వెల్లడించింది. ఇరాన్ అణుస్థావరాలను అమెరికా ధ్వంసం చేశాక ఇజ్రాయెల్ మళ్లీ తన దాడులను కొనసాగిస్తోంది.

# వర్క్ ఫ్రమ్ హోం పేరిట బురిడీ

- అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్
- కోట్లు విలువచేసే సైబర్ నేరం భగ్నం
- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్,జూన్ 23 :** వర్క్‌ఫ్రం హెూం పేరిట అమాయకులను బురిడీ కొట్టిస్తున్న సైబర్‌నేరగాళ్ల ముఠాను పట్టుకున్నట్టు ఎస్పీ అఖిల్‌మహాజన్‌తెలిపారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మధ్యప్రదేశ్ జిల్లా తికమ్‌గఢ్, ఉపమండలం జటారాకు చెందిన ఇద్దరు నిందితులు ఒకరు సౌరభ్ రాయక్వార్, మరొకరు రితిక్ సేన్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుండి 4 మొబైల్ ఫోన్‌లు, లాప్ టాప్, 3 బ్యాంకు పాస్ బుక్స్ కీబోర్డ్, మానిటర్.పాన్ కార్డులను స్వాధీనం చెసుకున్నట్ల తెలిపారు. ప్రతిరోజు 70 మంది బాధితులకు మెసేజ్ రూపంలో చాటింగ్లు, నెల రోజులలో 900 మందికి డబ్బు పంపించి వారి వలల్లో దించే ప్రయత్నం చేసే వారని,వీరు వాట్సాప్, టెలిగ్రామ్ ఏర్పాటు చేసిన గ్రూప్ లలో జాతీయంగా 250 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారన్నారు. ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి జాతీయంగా, అంతర్జాతీయంగా ఉన్న నిధితులను పట్టుకోవడానికి జిల్లా తరపున ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు జిల్లా ఎస్పీ తెలిపారు.అమాయకులను వాట్సాప్ ద్వారా వర్క్ ఫ్రం హెూం, తక్కువ డబ్బులతో, తక్కువ సమయంలో, ఎక్కువ లాభం సంపాదించవచ్చు అంటూ మోసం చేస్తూ సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు.సైబర్ నేరానికి అప్రమత్తతే సరైన అస్త్రమని సూచించారు.సైబర్ నేరానికి గురైన వెంటనే 1930కి సంప్రదించాలని కోరారు.డబ్బులను పోగొట్టుకున్నట్లయితే వెంటనే గోల్డెన్ హవర్ ఒక గంటలోపు సంప్రదించినట్లయితే పూర్తి డబ్బులను తిరిగి రాబట్టే అవకాశం ఎక్కువగా ఉన్నదని తెలిపారు.ముఖ్యంగా ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్ల పాత్ర పెరిగిపోతున్న సందర్భంలో ప్రజలు అప్రమత్తతతో ఉండటం శ్రేయస్కరమని తెలిపారు.ఈ సమావేశంలో ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీఐ కె ఫణిదర్, ఎస్సై వి విష్ణువర్ధన్, నవనీత్, సంజీవ్, మండల్ సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

